# ముగింపు దొరికింది!

శ్రీ ఆర్. ఎం. చిదంబరం

జ్ఞాపకశక్తనేది లేకుండా వుంటే బాగుండునని మనలో ప్రతి ఒకరు ఎప్పుడో ఒకప్పుడు అనుకోక తప్పదు. అది ఉండబట్టే గడచిన కాలపు సంఘటనలు ముళ్ళపొదల్లా మనఃఫలకం మీద కనిపించి చీకాకు పరుస్తాయి. ప్రశాంతంగా వుందామనుకున్న సమయంలో ఏవో బాధలు తలపుకొస్తాయి. ఏనాటి జీవితం ఆనాటితో అంతమై తెర వెనక్కి జారుకుంటే ఎంత బాగుండును!

కాని ఇదంతా వూహాలో నిలిచిపోతుంది. ఇందులో ఏ ఒక్కటీ నిజం కాజాలదు. ప్రకృతి సిద్ధంగా ఇది ఎలాగూ సాధ్యం కాదు. కనక, ఒమర్ ఖయ్యాం కృత్రిమంగా ఈ వేదాంతాన్ని సృష్టించుకుని, ఆచరించి, ఆనంద మనుభవిద్దా మనుకున్నాడు. చివరి ఘడియల్లో తన్ను చూసి తనే అసహ్యించుకోడం తప్పలేదు.

ఈ రకం ఆలోచనల్తో కుస్తీపడుతూ, చేతిలో కాగితాలవంక చూడనే లేదు. రైలు వేగంగా పరుగెత్తుతూండటం వలన గాలి విసురు యెక్కువగా వుంది. చేతిలో వున్న కాగితాలు వరుసగా చదివితే వో కథ అర్థమవుతుంది. కాని దాని ముగింపు అర్థం కావటం లేదు. ఆ కథకూ, నా జీవితానికి సాన్నిహిత్యం వుంది గనక, ముగించటం వాస్తవికంగా వుండాలనే నా నిర్ణయం నేటివరకూ నిజం కాలేదు. పాసింజరు వేగం క్రమంగా తగ్గి ఓ స్టేషనులో ఆగింది. కిటికీలోంచి బయటకు చూశాను. 'రామాపురం' అన్న బోర్డు కనబడింది. ఛటుక్కున లేచి, సూట్ కేస్, హాండ్ బేగ్ తీసుకుని గబగబా రైలుదిగాను. బండి వంకరలు తిరుగుతూ బరువుగా కదలిపోయింది.

జేబులోంచి టిక్కట్టుతీసి చూశాను. 'మద్రాసు' దాకా వెళ్ళవచ్చు. ఆఫీసు పనిమీద ఎల్లుండి ఓ లాయర్ను కలుసుకోవాలి. కాని ఏదో అర్థం కాని శక్తి నన్ను సగందారిలో దింపివేసింది. కథకు ముగింపు దొరుకుతుందన్న ఆశ కావచ్చు—లేక—మానసిక దౌర్బల్యం కావచ్చు - ఆ రెండూ కాకపోతే గోపితో నాకున్న పరిచయం కావచ్చు. ఏదెలా వున్నా నా ప్రయాణం ఖండించబడింది.

చేతి గడియారం చూసుకున్నా. అయిదున్నరైంది. స్టేషనులో జనం ఎవరూ లేరు. చుట్ట కాల్చుకుంటూ పరధ్యానంగా వున్న ఓ ముసలాడు—మల్లెపూలు అమ్మడు పోనందుకు ఏడుపుముఖం పెట్టిన ఓ బుల్లి అమ్మాయి - 'ఇస్తే ఇవ్వండి. లేకపోతే మానేయండి' అన్నట్టు కుడిచేయి ముందుకు చాపి గేటుదగ్గిర నిలబడ్డ స్టేషను మాస్టరు.

అక్కడికి రామాపురం మైలున్నర వుంటుంది. చేల గట్లమీదుగా నడక ప్రారంభించాను. అస్తమయ సూర్యుడు ఎవరిమీదో కోపగించుకుని ముఖం ఎరుపు చేసుకున్నాడు. వరిపొలాల్ని కాపలా కాస్తున్న వీరుల్లా తాటిచెట్ల వరుసలు— వంకరలు తిరిగిపోతున్న చిన్న చిన్న నీటి ప్రవాహాలూ—గబగబ అడుగులు ముందుకు పడ్డాయి. నాకెదురుగా వస్తున్న వ్యక్తి నన్ను చూసి ఆగి నమస్కరించాడు.

'నేను జ్ఞాపకం వున్నానా మేష్టారూ?' అనడిగాడు. ఓ నిమిషంపాటు ఆలోచించాక గుర్తుకు వచ్చింది. పదిహేనుసంవత్సరాలక్రితం అతను నా విద్యార్థి. చిరుగు చొక్కా - చింపిరి తల - దొంగ చూపులు. ఇవీ వాడి ప్రత్యేకత - ఈ నాడు సిల్కు చొక్కా - బంగారు గొలుసు - చేతికి బంగారు వాచీ-

'ఏమోయ్ రమణా! .. బాగున్నావా? ఏం చేస్తున్నావ్?' అనడిగాను.

'ఏదో మీ దయవలన ఇలా వున్నాను. ఆనాడు మీ సలహావిని కష్టపడి చదివివుంటే, మంచి వుద్యోగం చేసేవాడిని - నాలుగూ తెలుసుకుని, ప్రపంచంతో కలిసి పోయేవాణ్ణి.' అంటూ నవ్వాడు. ఆ మాటలతను నిజంగా అంటున్నాడో, లేక చాలాకాలం తరువాత కనపడిన మేష్టార్ని కాస్త వుబ్బవేద్దా మనంటున్నాడో తెలిసింది కాదు.

'అదంతా వట్టి భ్రమయ్యా!.. నేను డిగ్రీ పుచ్చుకుని సాధించిన దేమిటి? మీ తాత ముత్తాతల

నుండి వస్తున్న వృత్తిని చేపట్టావు. చాలు...అది సరే కాని-' అంటూ ఆగిపోయాను. ఆ ప్రశ్న అడగటానికి భయం వేసింది. విషాద వార్తలు విని అరగించుకునే ఓపిక లేదు. అంతకంటె అడక్కుండా వుంటే నే బాగుంటుంది. రవణ అడగమన్నట్టు చూశాడు.

'మరేం లేదు - పెళ్ళైందాని అడగాలనుకున్నా - అంతే - మరివస్తాను.' అంటూ ముందుకు కదలిపోయాను.

గోపి భవిష్యత్తును ఏ నాడో నిర్ణయించివేశాను. మరి అడగటానికెందుకింత భయం? నా అభిప్రాయాలు అన్నీ తారుమారౌతాయన్న అనుమానం కావచ్చు - మరో అరగంటలో రామాపురం చేరుకున్నా - ఈ పదిహేను సంవత్సరాలలో ఆవూరు చాలావరకూ మారిపోయింది. అక్కడక్కడా కొత్త మేడలు లేచాయి. విద్యుద్దీపాలు ఆనాడు లేవు. కాని, వీటితో నాకేలాంటి ప్రమేయమూ లేదు. తిన్నగా గోపి ఇల్లు చేరుకున్నా. హాల్లో ఎవరూ లేరు. గోపిజాడ ఎక్కడా కనిపించలేదు. పెరిగి పెద్దయ్యాక తీయించుకున్న ఫోటో కనిపిస్తుందేమోనని గోడలు వెదికాను. ఎవర్ని పిలవాలో, ఎలా సంబోధించాలో తెలియక తికమకలు పడుతున్న సమయంలో ఓ అమ్మాయి వచ్చింది.

'మూర్తిగారున్నారా?...' అనడిగాను, ఆ అమ్మాయెవరైనది సరిగ్గా తెలియక పోయినా. గోపి చెల్లెలై వుంటుంది. ఆమెకు రెండేళ్ళ వయసున్నప్పుడు చూసిన గుర్తు. ఆమె సమాధానం చెప్పకుండా వయ్యారంగా లోపలికిపోయింది. మరో నిమిషానికి ఓ నడివయస్కురాలు వచ్చింది. ఓ చేతిలో సూట్ కేస్, మరో చేతిలో హాండ్ బాగ్ వున్న నన్ను చూసి ఆమె ఏమనుకుందో కాని, ఆశ్చర్యంతో కనురెప్పలు రెండు సార్లు కదిపింది. ఆమె గుర్తు పట్టకపోయినా నాకు తెలిసిపోయింది.

'నమస్కారం!.. జ్ఞాపకం వున్నానా?' అనడిగాను.

'మీరా మేష్టారూ?... కులాసాగా వున్నారా?... అమ్మాయ్? మేష్టారికి కాఫీ తీసుకురా. అలా కూర్చోండి' అంది ఆప్యాయంగా గోపి తల్లి. పది నిమిషాలపాటు ఏవో కబుర్లు చెప్పుకున్నాం. గోపి విషయం ఎవరూ ప్రస్తావించలేదు. కాఫీ తాగుతుండగా, గోపి నాన్న కూడా వచ్చాడు.

భోజనాలయ్యాక ఆరుబయట మంచం వాల్చుకుని పడుకున్నా. వెల్లకిలా పడుకుంటే నీలాకాశం కనపడింది. చందమామ భార్యల పోరు పడలేక శక్తికొలదీ పరుగెడుతున్నాడు. కోట్లకొలది నక్షత్రాలు మిణుకు మిణుకు మన్నాయి. గోపి ఆ చుక్కల్లో కలిసిపోయుండొచ్చు. ఛీ!...అలా ఎన్నటికీ జరగదు. గోపి చనిపోవట మేమిటి? హిమాలయాలు కరిగిపోవటం? గంగ యింకిపోవటం - ఇద్దరు మనుష్యుల మనసులు ఏకం కావటం - ఇవి ఎలా అసంభవమో, అదీ అంతే. నిద్ర పట్టిందికాదు. లేచి నెమ్మదిగా నడక సాగించాను. ఏ అర్ధరాత్రో నేను కనపడకపోతే గాభరాపడి, ఏ దెయ్యమో, భూతమో ఎత్తుకుపోయిందని గోల పెడతారేమో! నా తెలివి తక్కువకు నవ్వుకుంటూ అడుగులు ముందుకు వేశాను. నిశ్శబ్దం వెయ్యి హస్తాలు చాచి శబ్దం నోరు నొక్కివేసింది. అప్పుడప్పుడు ఎక్కడో కుక్కలు అసంతృప్తిగా మొరుగుతున్నాయి. తన్మయత్వాన్ని వెదుక్కుంటున్న ఎవరో వ్యక్తి హాయిగా మురళీగానం వాయిస్తున్నాడు. అదే గానాన్ని పదులు, పాతికలు పెట్టి టిక్కట్లుకొని వింటారు. కాని ఇప్పుడెవరు వింటారు? సగంనిద్రలో వున్న చెట్లు - మత్తుగా ఆవులిస్తున్న పక్షిసంతతి - ఇవే ఆ పాటను వినాలి. పెద్ద గుడ్డముక్కను చిన్న చిన్న పీలికలుగా చించివేసినట్టు గాలి ప్రవాహాలు - ఇలాంటి రాత్రుల్లో గోపి, నేను ఎన్నో విషయాలు చర్చించుకున్నాం. తిన్నగా స్కూలుకు వచ్చి, పచ్చికలో కూర్చున్నా. స్కూలు ఊరికి దూరంగా వుంది. జీవితాన్ని స్పృశించి అనుభవించడానికిదే సరైన స్థలం.

అవకాశం - అనుకూలత - ఈ రెండూ జతకాగానే జ్ఞాపకశక్తి పనిచేయ నారంభించింది. అందుకే, అది వుండకపోవడం శ్రేయస్కరమని ముందే చెప్పాను. జేబులోవున్న కాగితాల కట్టతీసి చదవటం మొదలు పెట్టాను. అది ముగింపులేని కథ - దాని ముగింపు కోసమే ఈ పదిహేను సంవత్సరాలు ఆగాను.

* * *

బి. ఎస్ సి. డిగ్రీ పుచ్చుకోగానే, ఏవో ఆశలు, ఆశయాలు నన్ను చుట్టుముట్టాయి. ఉత్సాహంతో వుద్యోగంకోసం తిరిగి తిరిగి వుపాధ్యాయుడిగా రామాపురం వచ్చాను. అది పట్నంకాదు - సుమారు ఆరువందల ఇళ్ళుంటాయి. స్కూలు వూరికి అరమైలు దూరంలో వుంది. ఎలాగో తంటాలుపడి ఓ చిన్నగది

సంపాదించాను. అనాగరికత, మురికితనం, మూర్ఖత్వం- ఆ వాతావరణంలో కలిసివున్నా, నిరుద్యోగిగా బతికే కంటె, సహనంతో బతకటం మెరుగనుకున్నా.

అదే నా మొదటి అనుభవం - క్లాసులో అడుగు పెడుతుంటే కాళ్లు గాలిలో తేలిపోతున్నట్లనిపించాయి. నా కెదురుగా నలభైమంది విద్యార్థులు కూర్చుని ఏదో 'వింత జంతువు'ను చూసినట్లు చూడసాగారు. లెక్కల పాఠం మొదలైంది. కాలానికి, వేగానికి వున్న సంబంధం గురించి చెబుతూ 'గూడ్సు బండి - పాసింజరు బండి... ఈ రెండింటిలో ఏది త్వరగా పరుగెడుతుంది?' అనడిగాను. వేగాన్ని కనుక్కునేటప్పుడు కాలం స్థిరంగా వుండాలని బోధించాలని నా అభిప్రాయం. ఆ నలభైమంది గుడ్లప్పగించి చూశారు - ఒక్కరూ నోరు మెదపలేదు. రెట్టించి అడిగేసరికి ఓ అబ్బాయి నిలబడి 'గూడ్సుబండి...' అన్నాడు నవ్వుతూ. అతని సమాధానంలో స్ఫురించిన హేళన నన్ను చురుక్కున పొడిచింది. నిశ్శబ్దానికి, అణుకువకు వెనకవున్న అంతరార్థం ఇదన్నమాట.

'ఓరి చవటపీనుగా!...నువ్వో కుంటివెధవనుకో. నీపక్కనున్న అబ్బాయితో సమానంగా పరుగెత్తగలవా?' అనడిగాను. ఎందుకో అతనిముఖం చిన్నబోయింది. తల కిందికి వంచేసుకున్నాడు. క్లాసంతా చక్కిలిగింతలు పెట్టినట్లు గొల్లుమన్నారు. కొందరు చప్పట్లు చరిచారు కూడా. నాకంతా అయోమయంగా కనపడింది. ఆ అబ్బాయి కళ్ళల్లోంచి రెండు నీటిబొట్లు రాలాయి. 'నువ్వు కుంటివెధవవు' అనగానే అతని లేత గుండె గడగడలాడిపోయింది. మనస్సు చివుక్కుమంది.

'ఎందుకురా ఏడుస్తావ్?...నిన్నెవరూ ఏమీ చెయ్యలేదుగా!' అన్నాను.

'ఆ గోపీ అంతే మాష్టారూ! వట్టి పిరికిపంద- ఉన్నమాటంటే ఉలుకెక్కువట.' అన్నారు ఎవరో వెనకనుండి.

'కూర్చో. ఎవరైనా మాట్లాడారంటే జాగ్రత!' అని గదమాయించి పాఠం చెప్పుకుపోయాను.

మొత్తానికి ఏదో అసంతృప్తి నన్నుముంచివేసింది. ఒక్కరోజు గడవటం ముళ్ళమీద నడచినట్టుంది. ఇక ఏడాదిపాటు ఈ రథాన్ని లాగే దెలా? స్కూలు విడిచి పావుగంటైంది. పిల్లలంతా జట్లుజట్లుగా ఏనాడో వెళ్ళిపోయారు. సందడిగావున్న ఆ ప్రదేశం, వినాశం జరిగినతరువాత నిర్మానుష్యమైన మహానగరంలా తయారైంది. నెమ్మదిగా నడుస్తూ స్కూలు ఆవరణ దాటి బయటికొచ్చాను. నాకు పదిగజాల దూరంలో ఓ అబ్బాయి మోయలేక పెద్ద పుస్తకాలసంచీ మోస్తూ, కుంటుతూ నడుస్తున్నాడు. కాలికేమైనా గాయం తగిలిందేమో ననుకున్నా. కాని పరీక్షగా చూస్తే, ఓకాలు పొట్టిది. అంగవైకల్యం వున్న వార్ని చూస్తే ఎందుకో జీవితంమీద వెగటు కలుగుతుంది. సర్వాంగాలు తీరుగా అమరివున్నా, మనస్పర్థలు - కొట్లాటలు - అసూయాద్వేషాలు - శీలభంగం - ఇలాంటి విషసర్పాలనుండి తప్పించుకునే శక్తిలేక సతమతమవుతున్నాం. ఇంక ఏ కన్నో, కాలో, చెయ్యో లేనపుడు ముందుకు నడవడం ఎలా? పోనీ, 'ఈరకం మనుష్యులు ఎందుకు జీవిస్తారు- ఆత్మహత్య చేసుకోకూడదా?' అనిపిస్తుంది. ఒకరిద్దరి నడిగితే 'జీవించాలన్న కోర్కె ఏ పరిస్థితుల్లోనయినా ఉండితీరుతుంది. ఉన్నవాడు లేనివాణ్ని చూసి జాలి పడతాడుకాని, లేనివాడు దాన్నిగురించి అసలు ఆలోచించడు' అన్నారు. రెండుకాళ్ళూ ఉంటే, ఆఅబ్బాయి కూడా చెంగుచెంగున ఈపాటికి ఇల్లు చేరుకుని, అమ్మ అందిచ్చే తాయిలం తిని, హాయిగా ఆడుకుందుకి పోయేవాడు. అతనికా అదృష్టం లేదు. అరుగుమీద నిలబడి తతిమ్మా పిల్లల్ని చూసి, తనకొడుకింకా రాలేదని దిగులుగా ఎదురుచూస్తున్న అతని తల్లిని తల్చుకునేసరికి మనసు చివుక్కుమంది. అడుగుల చప్పుడు వినిగామోలు ఆ అబ్బాయి వెనక్కి తిరిగిచూశాడు. గుండె గతుక్కుమంది. అది గోపి!...'నువ్వు కుంటివెధవనుకో!' అన్న నా మాటలు జ్ఞాపకంవచ్చాయి. అతనికళ్ళనుండి రాలిన రెండు నీటిబొట్లూ రెండుమహాసముద్రాలై చెవులదగ్గర ఘోష పెట్టాయి. లేనిలోపాన్ని ఆపాదించటం వేరు. అన్నదాన్ని వేలెత్తిచూపటం వేరు. గోపి నా కోసం ఆగుతాడనుకున్నా. కాని అతని వేగంలో ఎలాంటి మార్పూలేదు. గబగబవెళ్లి అతన్ని ఓదారుద్దామనుకున్నా. కాని, వుపాధ్యాయుడినన్న ఆత్మాభిమానం ఆపివేసింది. గోపిమీద ఓ రకమైన అభిమానం, అమరాగం ఏర్పడడం కనుక్కున్నా.

ఆ మర్నాడు గోపి బడికి రాలేదు. కారణాలు మనవూహానుబట్టి మారుతూంటాయి. గోపి బడికి రాకపో

కటానికి కారణం నిన్నటి సంఘటనేనని నేను నమ్మినా కొందరు నవ్వి పారేస్తారు.

'గోపి రాలేదా?' అనడిగాను.

'ఎవరండి?'...నిన్నటి కుంటబ్బాయా?...' అన్నాడు ఓ విద్యార్థి—అతని కేసి కళ్లెర్రచేసి చూశాను.

'రాలేదండి'...ఒక వేళ వాళ్లమ్మ పిండి రుబ్బమందేమో!'

'కాదండి మాష్టారూ?...పులుసు, కూర వండమనుంటుంది.'

'వాళ్లకేం తెలియదండి. గోపి అమ్మ చీర పుతకమంటుంది—నామాట నిజమండి.'

అలా అడక్కుండానే రకరకాలైన సమాధానాలు వచ్చాయి. ఇదంతా నన్నేడిపించటానికి వేస్తున్న నాటకం కావచ్చు. లేక నిజం తాలూకు నీడకావచ్చు. ఉదారహృదయంతో ముందుకు వచ్చి అడక్కుండా జవాబు చెప్పినవారందరికీ వీపుమీద అక్షింతలు పడ్డాయి. ఆ సందిగ్ధ సమయంలో అంతకంటె తరుణోపాయంలేదు.

'ఈ మేష్టారికి, ఆ కుంటి గోపిమీద ఒక్క రోజులో ఎంత ప్రేమ వచ్చిపడిందో—' అన్నమాటలు ఆడపిల్లలవంతు.

ఏదైనా వస్తువును కాని, వ్యక్తిని కాని సంఘానికి, సంస్కారణకు దూరంగా వుంచమని నలుగురూ సలహాయిస్తే, దాన్ని ఆచరించేముందు 'అలా ఎందుకు చేయాలి?' అని కారణాలు వెదుకుతాం. అంటే, అందులో అసత్యం వుందనికాదు: ఆ వ్యక్తిని, లేదా వస్తువును ఎందుకు అసహ్యించుకోవాలో తెలుసుకుందామన్న ఆసక్తి. అదేవిధంగా నలుగురూ గోపిని ఎందుకు దూరంగా వుంచుతున్నారో కనుక్కోవాలన్న కుతూహలం నాలో ఎక్కువ కాసాగింది. కాని ఎలా తెలుసుకోడం? ఈ పిండి రుబ్బటం, పులుసువండటం ఇవన్నీ అకారణంగా పుట్టేవికావు. వీటికి తగినంత పునాది వుండి తీరుతుంది. ఎటొచ్చీ ఆ పునాదిని పదిమంది పది రకాలుగా వర్ణిస్తారు. అంటే—అంగ వైకల్యం వున్నంతమాత్రాన తలితండ్రులు కన్నబిడ్డను అసహ్యంచుకుంటారని—బాధిస్తారని అనుకోను—అలా చేయరు సరికదా, నలుగురూ చూపలేని సానుభూతిని, అనురాగాన్ని వర్షిస్తారు.

ఆ సాయంత్రం స్కూలు వదిలాక, సబ్బు కొందామని బయలుదేరాను. బజారు మధ్యగా వెడుతుంటే ఎవరో చప్పట్లు చరచి పిలిచినట్లయి వెనక్కి తిరిగిచూశాను. గోపి కుంటుతూ, వీలైనంత వేగంగా వచ్చాడు.

'నమస్కారం మేష్టారూ! ఇలా వచ్చారే? అన్నాడు—చెప్పాను.

'ఇంతదూరం వచ్చారు. మాఇంటిక్కూడా రండి' అన్నాడు వినయంగా.

'దానికేం ? ...... ఊరువిడిచి పోయేవాడిని కాదుగా! మరోమాటు చూద్దాం,' అనేసి రెండడుగులు ముందుకు వేశాను. గోపి పరుగెత్తుకు వచ్చి, నా కడ్డంగా నిలబడ్డాడు.

'అలా కాదు మేష్టారూ!...మీరు వచ్చి తీరాల్సిందే!' అంటూ మొండి కేశాడు. అతని ముఖం చూశాను. స్వచ్ఛ జలంలా నిర్మలాకాశంలా—మంచుకొండలా—మలిన రహితంగా వుంది. దృష్టి కాళ్ళమీదకు వెళ్లేసరికి మనసు చీకటితో నిండిపోయింది. గోపి ఇల్లు చేరుకున్నాం. అమ్మను తీసుకురావటానికి లోపలికి వెళ్ళాడు. అది శ్రీమంతుల గృహం. హాలునిండా ఖరీదైన సోఫాలు, కిటికీలకు సిల్కు కర్టెన్లు, నిగనిగలాడుతున్న కుర్చీలు, టేబిలు, ఫ్లవర్ వేజ్ లో కిలకిలానవ్వే పువ్వులు, నిశ్శబ్దాన్ని క్రమబద్ధంగా కొలుస్తున్న గడియారం—ప్రతివస్తువు డబ్బుతో మాట్లాడింది. గోపి అమ్మను పరిచయం చేశాడు. ఆమెను చూసి ఆశ్చర్యపోయాను. నేను వూహించుకున్న గోపితల్లికి, ఈమెకు ఎక్కడా పోలికలు లేవు. మాతృత్వం చిమ్ముతున్న కళ్లు, ప్రేమతో నవ్వే పెదవులు, బాధల్ని చూసి జాలిగా మారే ముఖం—ఇవి నేను వూహించుకున్న లక్షణాలు. అలాంటి స్త్రీకిమాత్రమే ఓకుంటబ్బాయి గుండెలో ఆశల్ని చిగురింపచేసే శక్తివుందని నావిశ్వాసం. నాకు ఎదురుగావున్న గోపితల్లి పొడుగాటిజడను మెడమీదుగా ముందుకు వదిలింది. వాయిలుచీర, జాకెట్టు, అర్ధచంద్రాకారపుబొట్టు, ఎడంచేతికి బంగారు వాచీ, వయసు పాతికేళ్ళ కెక్కువుండదు. కాలేజీ అమ్మాయి గుర్తొచ్చింది.

'గోపి బాగా చదువుతున్నాడాండి?' అనడిగింది.

'నేను నిన్ననే స్కూలుకు వచ్చాను. ఇవేళ తను బడికిరాలేదు...బుద్ధిమంతుడే ననుకుంటాను...ఎలాగూ

ఒకటి రెండు నెలలుపోయాక కాని మన స్తత్వం అర్థం కాదు.'

'కాస్త జాగ్రత్తగా వుండండి. పైకి అలా వున్నాడే కాని, మీ చేత మొగ్గలు వేయిస్తాడు.'

నాకు అసహ్యం వేసింది. గోపిగుణగణాలు ఆమెకు తెలిసివుండొచ్చు. ఒక్కసారి నన్ను చూడటంతోనే, నాశక్తిసామర్థ్యాలు ఆమెకెలా తెలుస్తాయి? నాగురించి పూర్తిగా తెలుసుకోకుండా, మాఇద్దర్నీ త్రాసులో వేచి తూచి 'మీకంటె గోపి గొప్పవాడు' అనడం అసందర్భంగానూ, అనవసరంగానూ కనపడింది.

'గోపి ఇవేళ బడికిరాలే దేమండి?' అనడిగాను సంభాషణను మరో దెసగా తిప్పనెంచి.

'అదా?...వాడికి వంట్లో బాగా లేదు-జలుబు-కొద్దిగా జ్వరం—ఏమాత్రం అనారోగ్యంవున్నా నేను జాగ్రత్తపడతాను. రోగాలు ముదరబెట్టుకోటం నాకిష్టం లేదు.'

గోపిచేత కాఫీ పంపించి ఆమె అదృశ్యమైంది, గోపి తను చదువుకునేగది చూపించాడు. శుభ్రంగా వుంది. గోడమీద ముచ్చటగా కాలెండరు, చిన్నకుర్చీ, టేబిలు, అందంగా అమర్చబడ్డ పుస్తకాలు, డ్రాయింగు పుస్తకంనిండా చిత్రమైన బొమ్మలు, అవన్నీ అతని వూహలోంచి వెలువడినవే. చంద్రమండలానికి రైల్లో మనుష్యులు వెడుతున్నట్టు - వెడల్పాటి యంత్రాలు కాళ్ళకుకట్టుకుని సముద్రంమీద సునాయాసంగా నడచిపోతున్నట్టు-తిండితినకుండా నెలకు ఓమాత్ర వేసుకునే మనుష్యులు. ఇలా రకరకాలైన బొమ్మలు. పరిపూర్ణత లేకపోయినా, కల్పనాశక్తి అనంతం. ఏదో అందని గమ్యస్థానాన్ని అందుకోవాలన్న ఆకాంక్ష ప్రతిగీతలోనూ కనిపించింది. పట్టుదలవున్న పిల్లలే పెరిగి పెద్దయ్యాక పెద్దవారౌతారు. డ్రాయింగు పుస్తకం మూసివేస్తూ 'ఇతనికి బ్రహ్మాండమైన భవిష్యత్తు వుంది' అని నిర్ణయించుకున్నా. అరుగుమీద కొచ్చేసరికి గోపి నాన్న వచ్చాడు. పరిచయాలయ్యాక మరో పదినిమిషాలు వుండిపొమ్మన్నాడు. గోపినాన్నకు నలభై సంవత్సరా లుంటాయి. జుట్టు అక్కడక్కడా నెరసింది. ముఖంమీదిచర్మం దగ్గరకు జరిగింది. కళ్ళు మాత్రం ఓసారి గంభీరంగానూ, మరోసారి దిగులుగానూ మారుతూవచ్చాయి. పావుగంటసేపు అనర్గళంగా మాట్లాడాడు. గోపి కుంటికాలుగురించి అడగాలనుకుని భయంతో వూరుకున్నా.

'గోపివంట్లో బాగాలేదట. అతనివాళ స్కూలుకు రాలేదు' అన్నాను.

ఆయన ఆశ్చర్యపోయి భార్యతో ఏదోమాట్లాడి వచ్చాడు.

'అదేంకాదండి! దాని కింట్లో పనెక్కువగా వుందట. పనిమనిషికి దానికీ అసలు పడదు. అందుకని సాయానికి ఇంట్లో వుండమందట. అంతేకాని, వాడి కే రోగమూలేదు' అన్నారు చెవిలో రహస్యంగా. ఈమాటు తెల్ల మొహం వేయటం నావంతు.

*　　　*　　　*

తరువాత వారంగోజుల్లో ఇద్దరం ఆత్మీయుల మయ్యాం. తతిమ్మా విద్యార్థులకంటె గోపి నాహృదయానికి దగ్గరగావచ్చాడన్న అభిప్రాయాన్ని నేను దాచటానికి యత్నించలేదు. అతనికి తెలియని ప్రతి విషయమూ అడిగేవాడు. విసుక్కోకుండా వివరించేవాణ్ణి.

ఓనా డుదయం లేచేసరికి తలనొప్పి, జ్వరం 'మేం వచ్చాము'టూ కావలించుకున్నాయి. విదలించుకోలేక స్కూలుకు సెలవుచీటీ పంపించి పడుకున్నా. ఇంటియజమాని ఓసారి వచ్చి పలకరించిపోయాడు. సాయంత్రం గోపి వచ్చి మంచందగ్గరగా నేలమీద కూర్చున్నాడు.

'మేష్టారూ! జ్వరంగా వుందా?' అనడిగాడు.

'లేదోయ్! కాస్త తలనొప్పిగా వుంటే పడుకున్నా. అనారోగ్యమంటే నాకూ మహా చెడ్డభయం! ఏమిటి స్కూలు విశేషాలు.'

'ఏం లేవండి...మీరు అబద్ధం చెబుతున్నారు. ఇందాకా ఇంటాయ నడిగాను. వంద డిగ్రీల జ్వరం వుందన్నాడు. మందు తీసుకు రమ్మంటారా?'

అతని పుస్తకాల సంచివంక చూశాను. పది మణుగు బరువుంటుంది. తన శరీరాన్ని మోయటానికే కాళ్ళకు శక్తి లేదు. ఈ సంచిని మోయట మెలా?

'రోగం లేనివాడికి మందు అనవసరం.'

గోపి నమస్కరించి వెళ్ళిపోయాడు. తప్పని సరిగా చూడ్డానికి వచ్చినట్టనిపించింది. గోపీకి నామీదుండే అభిమానాన్ని అనుమానించాను కూడా. మరో పది నిమిషాలకు డాక్టరుతో హాజరయ్యాడు.

'ఏమండోయ్ మాస్టరుగారూ! మా వూరికి చెడ్డ పేరు తేవాలని నిర్ణయించుకున్నారా? వచ్చీ రావటంతో జబ్బు పడి, ఎవరయినా అడిగితే రామాపురం జ్వరాలపురమని టాంటాం వేద్దామనుకుంటున్నారా?.. ...... అదీకాక, నెలరోజులు ఆగి జబ్బు పడక పోయారా? అంత తొందరేమొచ్చింది? ఏం కొంప మునిగింది?' అన్నారు డాక్టరు సీతాపతి. ఆయన పేరు విన్నాను కాని, చూడటం ఇదే మొదటిసారి. పొట్టిగా లావుగా, చిలిపి కళ్ళలో వున్న ఆయన్ని చూస్తుంటే వో వంక భయం, మరో వంక గౌరవం ఏర్పడ్డాయి. ఆయన హాస్యంగా మాట్లాడుతున్నాడో, లేక నిజంగా విసుక్కున్నాడో తెలిసిందికాదు. లేచి కూర్చున్నా. అబ్బే నాకు జ్వరం లేదండి. ఏదో కాస్త తల నొప్పిగా వుంటే ముందుజాగ్రత్తకోసం బడికి వెళ్ళక విశ్రాంతి తీసుకుంటున్నా. అంతే!' అన్నాను నవ్వుతూ. సీతాపతిగారు ముక్కుమీద ఒక్క గుద్దు గుద్దేవారిలా ముందుకురికి హుంకరించి 'ఇదిగో అబ్బాయ్! నువ్వు ఎవరితోనయినా అబద్ధం ఆడవచ్చు. కోతలు కోయవచ్చు. కాని డాక్టర్ సీతాపతితో కాదు. నీ అంతరాంతరాల్లో ఏముందో కనుక్కునే శక్తి, శిక్షించే అధికారం నాకున్నాయి. పిల్లలముందు డబాయింపువంటి దనుకున్నావా? నీ మొహం చూస్తే తెలుస్తూంది. నీకు నూటొక్క డిగ్రీల జ్వరం ఉందని' అంటూ ఛటుక్కున చేయి అంది పుచ్చుకుని నాడి చూడబోయారు. ఆయన మాటలు నా కోపాన్ని రగుల్కొలిపాయి. ఎంత డాక్టరయినా నా ఆంతరంగిక జీవితాన్ని, భావాలను విమర్శించలేడు. ఆ హక్కు ఎవరికీ లేదు. చేయి వెనక్కి లాక్కున్నా.

'థాంక్స్! నన్ను మీరు చిన్న పిల్లాడికింద జమకట్టి, చిత్తంవచ్చినట్టు మాటలాడా లనుకుంటే, అది పొరపాటు. నాకూ ఆత్మగౌరవ మంటూ వుంది. ఇక మీరు వెళ్ళవచ్చు' అన్నాను. పెద్ద సంఘర్షణ జరుగుతుందని, గోపి నన్ను అసహ్యించుకుంటాడని నాకు బాగా తెలుసు. కాని, నన్ను నేనే చిన్నచూపు చూసుకోటం ఆత్మద్రోహం. సీతాపతి పెంకు లెగిరేటట్టు విరగబడినవ్వారు. 'ఐ లైక్ యు మాన్ - నువ్వు నాకు నచ్చావ్. పౌరుషం అంటే అలా వుండాలి. నానాటికి అది స్త్రీల సొత్తై పోతోంది. కాపాడవలసిందే. రోగమంటూ వచ్చాక అలక్ష్యం చేయకూడదు. ఎందుకంటావేమో! ఈ చుట్టుప్రక్కల అంటువ్యాధులెక్కువగా ఉన్నాయి. మనం జాగ్రత్తపడడం అవసరం' అంటూ నాడి పరిశీలించి ధర్మామీటరుతో జ్వరతీవ్రతను నిర్ణయించి మందుకోసం గోపిని రమ్మన్నారు. గోపి ధర్మామీటరు కడిగేందుకు నూతి వైపుకు వెళ్ళాడు.

'నన్ను క్షమించండి డాక్టరు గారూ! మీ ఉదారత్వం నా కర్థంకాలేదు. గోపిని ఎందు కనవసరంగా బాధించటం? నేనే ఎలాగో వస్తాను.'

ఆయన మళ్ళీ నవ్వాడు.

'అబ్బాయీ! నువ్వు వట్టి అమాయకుడివి. ఆ అబ్బాయి చురుకైనవాడు. మంచివాడు. నువ్వంటే వాడి కెందుకో అభిమానం కలిగింది. నీ కోసం ప్రాణదానం చేయమన్నా చేస్తాడు. కాలంటూ లేదు కాని, ఉంటే ప్రపంచాన్ని కాల్చి వచ్చేవాడు.'

నాకు ఆసక్తి హెచ్చింది.

'డాక్టరుగారూ!...ఎదుటివాడి హృదయంలో ఏమున్నది అర్థం చేసుకునే శక్తి వుందన్నారు. అతనంటే నాకు జాలి, ప్రేమ - అతని భవిష్యత్తు తల్చుకున్నప్పుడల్లా గుండె గడగడలాడుతూంది ... అతని తలిదండ్రుల్ని గురించి...'

'అయ్యో మేష్టరుగారూ!...ఆగండి...ఆగండి.. అట్టే వాగొద్దు - జ్వరం ఎక్కువౌతుంది. ఆ కుటుంబ చరిత్రంతా నాకు తెలుసు. చెబ్తాను. సావకాశంగా విను.' అనేసరికి వుత్సాహం వుబుకుతూ వచ్చింది.

'ఇదిగోనండి మీ మీటరు' అంటూ గోపి వచ్చాడు. ఆయన మెడిసన్ఛెస్టు తీసుకుని వెళ్ళటానికి సిద్ధమయ్యాడు.

'ఒరేయ్ గోపి!... మేష్టారిమీద అభిమానం, గౌరవం వుంటే చాలదోయ్! కార్యరూపంలో వుండాలి. ఈ గది చూడు. అయిదూ బై నాలుగు. ఈ సీమవెండి గిన్నెలో మజ్జిగ కాని ఎన్నాళ్ళయిందని అడుగు. కనీసం నాలుగురోజులు. ఈ గోడలనుండి మట్టి రాలుతూంది. ఇదేమన్నా అలనాటి పుష్పవర్షమా! గదంతా సాలిగూళ్ళు-బొద్దింకల రాకపోకలు. ఇలాంటి చీకటి గుహలో మీ గురువును బంధించి, ఆత్మత్యాగం చేసుకుని, మీ అందరికీ విజ్ఞానం ప్రసాదించమంటే ఎలాగోయ్? ఇదుగో, కుంటబ్బాయ్! నిజం చెబుతున్నా. మీ మేష్టారు ఓ నాటి అర్ధరాత్రి మూటా

ముల్లె సర్దుకుని, ఎవరితోనూ చెప్పకుండా, చెయ్యకుండా, వెనక పడ్డరోడ్డు ఎక్కడ కనిపిస్తుందోనని జట్కా గుర్రంలా కళ్ళ కిరువైపులా చేటలు కట్టుకుని వుడాయిస్తారు—కబడ్దార్ . . .'

మరి నేనేం చేయనండి?...ఈయింటి యజమాని నామాట వింటాడా? నేను చిన్నవాణ్ణి. మీరు కాస్త కదిలిస్తే!' అంటూ నసిగాడు గోపి. ఈ రంగస్థలనాటకం నాకేం అర్థం కాలేదు. ఈ వేలెడుకుర్రాడు, ఆకళ్ల జోడు మనిషి నన్ను వేళాకోళం పట్టిస్తున్నారేమోనని అనుమానపడ్డాను.

'అది కాదోయ్ పిచ్చివాడా! వందమంది వసించే డాబా వుంది కదా మీకు? ఓ గది ఇవ్వలేరూ? మీ అమ్మనడుగు—'ఊ' అంటే సరే సరి. మర్చిపోయి మీ నాన్న నడిగావు కనక—ప్రయోజనం వుండదు. వస్తానయ్యా వెర్రిమేష్టరూ! కాస్త బుద్ధిగా, కుదురుగా వుండు. నాలిక తెమ్మంటోంది కదా అని పచ్చి మంచినీళ్ళు తాగావు కనక - నా ప్లాస్కుతో వేడి నీళ్ళు పంపుతాను. తిక్కతో ఆరుబయట తిరక్కపడుకో. మీదికొస్తే మంగులేదు.' అనేసి రెండడుగులు ముందుకు వేశారు.

'మీ ఋణం...' అంటూ ఏదో ప్రారంభించాను.

'చాలు చాల్లేవయ్యా!...పుస్తకాల్లో చదివిన సోది కబుర్లు—' అంటూ ఆయన కదలిపోయాడు.

ఈ పావుగంటలో సీతాపతి గారికి, నాకూ మధ్య జరిగిన సంభాషణ తల్చుకుని నవ్వుకున్నా. ఈ ఆర్భాటం—చీవాట్లు—హాస్యం—వీటి వెనక ఆయనలో సరళ హృదయం వుందని స్పష్టమైంది. ఆలా ఆలోచిస్తూండగా గోపి మందు, ఫ్లాస్కు అసుకు వచ్చాడు.

'మేష్టారూ!... నేను గదికోసం అమ్మ నడుగుతాను. ఒకవేళ ఆమె కాదు, కూడదు అంటే...' అంటూ తడబడ్డాడు.

'మరేం ఫరవాలేదు—డాక్టరుగారు ఏదో అన్నారు లే—నీ మానాన నువ్వూరుకో—అడిగి లేదనిపించుకునేదానికన్నా, అడక్కపోవటం మంచిది.'

గోపి మాట్లాడకుండా తలవంచుకుపోయాడు.

గోపి కుటుంబచరిత్ర తెలుసుకోవాలన్న ఆకాంక్ష ఎక్కువ కాసాగింది. దేవలోకంనుండి దిగిన విలాస కన్యలా తల్లి—పనికిరాని విషయాలమీద ఉపన్యసించే తండ్రి, వీ రిద్దరిమధ్య గోపిజీవితం ఎలాంటి ఆకృతి పొందుతుంది?...గోపి వయసుకు, అతని తల్లి వయసుకు పది సంవత్సరాలకంటె వ్యత్యాసం వుండడాని కవకాశం లేదు. చేతి గడియారంవంక చూసుకుంటే ఎనిమిది కావస్తోంది. ఈ పాటికి సీతాపతి గారు ఇంటికి తిరిగివచ్చివుంటారు. నే నడిగితే ఆయన కాదనరు. తలుపు తాళంవేసుకుని తొందర తొందరగా బయలుదేరాను. జ్వరంవున్నా, అర్థంకాని శక్తి ఆవేశంలో ముందుకు నడిచింది. ఆకాశంవంక చూస్తే, మబ్బులు కమ్ముకున్నాయి. అక్కడక్కడ మెరుపులు మెరిశాయి. వర్షం వస్తుందేమోనని భయం వేసింది. అరగంటలో తిరిగిరావాలని నిర్ణయించుకుని ఆయన ఇల్లు చేరుకున్నా—ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

'రావయ్యా! అభ్యుదయమానవా!...జ్వరాన్ని కూడా ధిక్కరించి దయచేశావ్?' అన్నారు నవ్వుతూ. 'జబ్బుగా వున్నప్పుడు ఎందుకు వచ్చావ'ని దులిపేస్తే ఏం చేయటం?...'రోట్లో తలదూర్చాక' అన్న సామెతలా తప్పదు మరి.

'అది కాదండి!...చుట్టూ ఏదో అంటుజాడ్యాలున్నాయన్నారు కదా! ఇంజక్షనిస్తే బాగుంటుందని....'

'హరిశ్చంద్రా!...కట్టిపెట్టు నీ కల్లబొల్లి కబుర్లు! గోపిగురించి వివరాలు తెలుసుకుందామని వచ్చావు. నా ముందు అబద్ధాలు ఆడవద్దని ఇదే ఆఖరుసారిగా చెప్పటం—ఫైనల్ వార్నింగ్!'

నేను సిగ్గుతో తలవంచుకున్నా.

'గోపితల్లి చనిపోయి చాలా కాలమైందయ్యా!...అతను పుట్టిన రెండు సంవత్సరాలకు కన్నుమూసింది పాపం. ఇప్పుడున్నది సవిత్తల్లి. అందుకే అతన్ని ఏడపించుకు తింటోంది. మూర్తి చాలా మంచివాడు. కాలేజీలో ప్రొఫెసరు. పొద్దున్న సైకిలుమీద వెడితే రాత్రి ఇంటికొస్తాడు ఈ మధ్యకాలంలో ఏం జరిగేది అతనికి తెలియదు. గోపి పల్లెత్తుమాటైనా అనడు...ఇదీ ఒకందుకు మంచిది. రేపు పెళ్ళాం వస్తే గోపి తెల్లమొహం వేయక చక్కగా వంట చేయగలడు—పిల్లల్ని పెంచగలడు. సరైన తరిఫీదు—'

నేను ఆశ్చర్యంతో విన్నాను. సీతాపతి గారు ఏమీ జరగనట్టు వివరించినా, అందులోవున్న భయం

ర సత్యం నన్ను ఆలోచనలో పడేసింది. గోపిచుట్టూ వెయ్యి విషసర్పాల బుసలు.

'డాక్టరుగారూ! మరో చిన్న సందేహం!... ఈ కుంటికాలు పుట్టుకతో వచ్చిందా? లేక ఏదైనా ప్రమాదంలో చిక్కుకుని...'

ఆయన నాకేసి కళ్ళెర్రచేసి చూశారు. కోపంతో బలంగా బల్లగుద్దారు. గుండెలు పీచుపీచుమన్నాయి. జ్వరం రెండువందల డిగ్రీలు చేరుకున్నట్టయింది.

'నువ్వు రైలుప్రయాణాలు తరుచు చేస్తుంటావా?'

నా ప్రశ్నకు, దీనికీ వున్న సంబంధం?...... ఒకవేళ గోపి రైలుప్రమాదంలో చిక్కుకొని కాలు పోగొట్టుకున్నాడేమో!

'చేశానండి...' అన్నాను భయంతో.

'కూర్చోటానికి చోటిమ్మని బతిమాలుతూ కొందరు ప్రయాణీకులు వస్తూంటారు. దయతల్చి కాస్త చోటిస్తే ఇటు అటూ జరిగి విశాలంగా కూర్చుని, చివరకు మనల్ని ఓ మూలకు నెట్టేసి పడుకుంటారు - సూక్ష్మంగా చెప్పాలంటే, కూర్చోమంటే పడుకున్నాడు. నువ్వూ అలాంటివాడివే!

'ఏదో జ్వరంతో రాత్రిపూట వచ్చాడు.పాపం! అని కొంచెం తాయిలం పెడితే ఇంకా తెమ్మంటావు? వెళ్ళవయ్యా! నీపని చూసుకో!' ఇంక లాభంలేదని నమస్కరించి వచ్చేశాను.

అప్పటికే వర్షం మొదలైంది. సీతాపతిగారికీ విషయం తెలియదు. తెలిస్తే గొడుగుపట్టుకుని వచ్చివుండేవారు. లేక ఆరాత్రి ఇంటోగదిలో పెట్టి తాళం వేసేవారు. అయిదు నిమిషాలు నడిచేసరికి వర్షం ఎక్కువైంది. ఇంక లాభంలేదని, ఓ ఇంటి అరుగెక్కి ఆశ్రయం పొందాను. చీకట్లో మధ్య మధ్య మెరపు తప్పించి మరి వెలుగు లేదు. జేబురుమాలుతో తడిసిన తల తుడుచుకుందుకు ప్రయత్నించాను.

'అదికాదే అమ్మా!...ఆ గదిలో జంతువులు కూడా వుండలేవు. పాపం! మన మేష్టారే కదా! ఇంత పెద్ద ఇల్లు మనకుంది—ఓ చిన్న గది స్తే ఏంపోయింది? డాక్టరుగారుకూడా చెప్పారు.'

ఆశ్చర్యపోయాను. అది గోపికంఠం—ఇంటోంచి వినపడుతోంది.

నేను ఎక్కడున్నానో అర్థమైంది.

'ఏడిశావ్! నీ తలకాయ! ఇలాంటి పెత్తనాలు నెత్తినేసుకొచ్చావంటే పీక పిసికి పారేస్తాను. నీ కుంటికాలు వెధవమొహానికిదొక్కటే తక్కువైంది. ఛీ!...'

అంతే! ఆతరువాత గోపి ఏడవటం—ఎవరో కొడుతున్న చప్పుడు. తలుపుతట్టి ఆమెను పిలిచి గట్టిగా చివాట్లు వేయాలనిపించింది. ఉద్రేకాన్ని అణచుకుని ఆ వర్షంలో తిరుగుముఖం పట్టాను.

వానలో తడవటంమూలాన ఆ మర్నాటికి జ్వరం ఎక్కువైంది. సాయంత్రం గోపివచ్చి నా స్థితి చూచి మరింత బాధపడ్డాడు. మోచేతిదగ్గర, కాలుమీద వాపులు కనిపించాయి.

'ఏమిటిదంతా?...' అనడిగాను.

'పొద్దున్న వీధిలో జారిపడ్డాను' అన్నాడు.

'అబద్ధం! నాకు గది కావాలనడిగినందుకు అమ్మ కొట్టింది. నాకు తెలుసు. దానికంతకూ మూలకారణం నేను. మళ్ళీ ఇలా చేశావంటే ఈవూరు వదలిపోతాను. నాకోసం మరొకరు బాధపడటం నేను సహించను—తెలిసిందా?' అని మందలించాను. గోపి తలవంచుకుని కాసేపు మౌనంగా నిలబడ్డాడు. అంతకంటె అతన్నెక్కువ చీవాట్లువేయనక్కర్లేదు. మనసు వులిపొరకగితంలాంటిది. చిరగటానికి ఎంతోసేపు పట్టదు. కాసేపు స్కూలు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. మరి కొంతసేపటికి సీతాపతిగారు వచ్చారు. బహుశ గోపి వెళ్ళి పంపివుంటాడు.

'నూటొక్కటి' అన్నారు టెంపరేచరు చూసి. గుడ్లప్పగించి చూస్తూ పడుకున్నా.

'చిన్నపిల్లలకైనా కాస్త ఇంగితజ్ఞానం వుంటుంది నీకదికూడా లేదు. ఒళ్ళు కాగిపోతుంటే వర్షంలో వాహ్యాళి. నువ్వు మేష్టరుగా పనిచెయ్యటానికి ఎంతమాత్రం పనికిరావు' అని ఇంజక్షనిచ్చారు.

'క్షమించండి. ఏదో బుద్ధి గడ్డి తిని...' అంటూ ప్రాధేయపడ్డాను.

'కాదయ్యా! నీబుద్ధి హల్వా, గులాబ్‌జాం తింటోంది' అని గట్టిగా నవ్వారు.

'కాస్త కారంకూడా మధ్యమధ్య వుండాలి. తీపి పదార్థాలు అదే పనిగా తింటే వెగటు కలుగుతుంది' అన్నాను తెగించి.

ఆయన తోలుసంచి సర్దుకుని వెళ్ళటానికి సిద్ధమయ్యారు.

'డాక్టరుగారూ! నిన్నటి నా ప్రశ్న?' అనడిగాను.

వెనక్కి తిరిగి ఏమన్నట్లు కుడికన్ను చిన్నదిచేసి, ఎడంకన్ను పెద్దదిచేసి చూశారు.

'ఓ! అదా!...అదొక రహస్యం కుశాగ్రబుద్ధీ! ఎవరి చెవినీ పడవేయకు. కుర్రాడు ఆరోగ్యంగా, అందంగా, నిండుగా వుండేవాడు. రెండోఏట తల్లి పోయింది. మూడో ఏట మేడమీదనుండి కిందపడ్డాడు. కాలు విరిగింది.'

'ఇందులో రహస్యం ఏముంది డాక్టర్!... మామూలుగా జరిగేదే!'

'కాదోయ్ మందబుద్ధీ! పూర్తిగా విను. అతను పొరపాటున కాలుజారి కిందపడలేదు. వెనక నుండిన సవితల్లి కిందకు తోసేసింది.'

ఆలస్యమైనట్టు, వ్యర్థ ప్రసంగం చేస్తున్నట్టు ఆయన చేతివాచీ చూసుకున్నాడు.

'కారణం!...'

'ఓయి అపరాధ పరిశోధ కాగ్రమా! నా దుంప తెంపుతున్నావు. లోకజ్ఞానం బొత్తిగా సున్న నీకు, అందంగా వున్న కుర్రాణ్ణి, తనబిడ్డ కానప్పుడు సవితల్లి ప్రేమించలేదు. అదీకాక, అతనంటే మూర్తికి ప్రాణం. ఒకనాడు కాకపోతే ఒకనాడు ఆమెకది ప్రతిబంధకం. అందుకని చంపేద్దామని తోసేసింది గామోలు! కాలు విరిగి వూరుకుంది' అనేసి గట్టిగా నవ్వటం మొదలు పెట్టారు.

'డాక్టరుగారూ!...ఆ కాలు బాగుచేయటం పడదా?'

'అసాధ్యం సర్జన్ జనరల్ గారూ! విరగ్గానే అతకటానికి ప్రయత్నించాం. చెన్నపట్నం తీసుకుపోయి తంటాలుపడ్డాం. బొంబాయిలో ప్లాస్టిక్ సర్జరీ పని చేస్తుందేమోనని చూశాం. లాభం లేకపోయింది. ఆ కుర్రాడు చనిపోయినా బాగుండును.'

'అలా గనకండి!...అంగ వైకల్యం వున్నంత మాత్రాన ఓ వ్యక్తికి ప్రపంచంలో స్థానం లేకుండా పోదు. నిజానికి, అలాంటి వారికే గొప్ప భవిష్యత్తు వుంటుంది. సర్వావయవాలూ తీరుగా వున్న వారికి జీవితంలో ఇబ్బందులు, ఆశలు, ఆదర్శాలు ఎవీ వుండవు. మందలో మేకలా-గుంపులో మనిషిలా-ఒకే గమ్యస్థానం వైపు-ఒకేదృష్టితో అటూ ఇటూ దూరాన రకరకాలైన పూలతోటలు-వింతలు-విచిత్రాలువున్నా చూడకుండా నడుస్తారు. గోపిలాంటి వారు ఎప్పుడూ తమ లోపాల్ని గురించి ఆలోచిస్తూ, అందరికంటె వెనకనడుస్తూ ఆ పువ్వుల్ని, వింతల్ని చూసి ఆనందిస్తారు. ఇతరులకు మార్గదర్శకులవుతారు. మిల్టన్, సర్ వాల్టర్ స్కాట్— అందరూ అలాంటివారే!'

'కవి పుంగవా! చాలించు. నీ కవిత్వం వేరే కాగితంమీదరాసి పంపించు. తీరిగ్గా చదివి సంతసిస్తా. అనేసి గట్టిగా నవ్వారు. నేను కొద్దిగా సిగ్గుపడ్డాను.

'మాస్టర్ జీ... నేను ఇంతసేపు గోపి గురించి చెప్పినదంతా నిజమని నమ్ముతున్నారా?...అంతా వట్టిది. కల్పన. అసందర్భం అలా ఎక్కడైనా జరుగుతుందా? ఎంత సవితల్లైనా అంతటి అఘాయిత్యానికి తల పెట్టదు. అందుచేత ఇప్పుడు విన్నదంతా మర్చిపోవటం మంచిది' అనేసి గబగబ వెళ్లిపోయారు.

తలా తోకా అర్థంకాలేదు. చేతిలో రూపాయి నోటు వుంచి అబ్బాయ్! అదివట్టి కాగితం ముక్క. అవతలకు విసిరేయ్! పనికిరానిది.' అన్నట్టుగా వుంది. ఆయన నమ్మవద్దని హెచ్చరించినా, నేనుమాత్రం విశ్వసించాను. కారణంలేనిదే కథ వెలువడదు.

జరిగింది భూతకాలం మాట. ఇక భవిష్యత్తు గురించి ఆలోచించాలి. గోపి బతికి వుండటం తల్లికిష్టం లేదు. తన ప్రయత్నంలో ఓసారి ఓడిపోతే, మరోసారి ప్రయత్నించదని నమ్మకమేమిటి?...అందుకే అతన్ని రాచిరంపాన పెడుతోంది గామోలు! వెలుగు నింపవలసినచోట చీకటి కుమ్మరిస్తోంది. నేను చేయగలిగిందేమీ లేదు కనక గోపి గురించి ఆలోచించకూడదనుకున్నా. మరో మూడు రోజులకు స్కూలుకు వెళ్లాను.

*   *   *

గది దొరకలేదన్న ప్రశ్న దానంతటదే సమాధానాన్ని వెతుక్కుంది. స్కూల్లోవున్న 'సామాను గది' ఖాళీచేసి నాకిచ్చారు. దాన్ని వాస యోగ్యంగా మార్చుకున్నా. చుట్టూ వరి పొలాలు, తోటలు దూరంగా పెద్దచెరువు, స్వచ్ఛమైనగాలి, ఒకరితో జోక్యం లేదు. స్వేచ్ఛ జెండా ఎత్తింది.

ఓనాడు రాత్రి ఏడుగంటలు-గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నా. వెన్నెల భూమినంతా ఆక్రమించుకుంది. నిశ్శబ్దం ఎవరోన్ని జోకొడుతూంది. గోపి నెమ్మదిగా వచ్చినా ముందు కూర్చున్నాడు.

'ఏమోయ్! ఈ వేళప్పుడు వచ్చావ్? మీ అమ్మకో నాన్నకో తెలిస్తే నీకు అక్షింతలు తప్పవు.' అన్నాను నవ్వుతూ.

'మరేంలేదండి!...మా అమ్మ సబ్బుకొనుక్కు రమ్మంది. గదిలో దీపం కనిపిస్తే వచ్చాను. మేష్టారూ! మీరు రాత్రిళ్ళు గది తలుపులు తెరచుకుని పడుకోకండి. ప్రమాదం. ఈ చుట్టుపక్కల పెద్ద పెద్ద నక్కల గుంపులున్నాయి. అవి మంచి నిషాలోవుంటాయి కనక మీదపడి కరుస్తాయి. ఒంటరిగా వున్నారు కనక మీరేం చేయలేరు.'

'అలాగా!...నాకిదంతా తెలియదు సుమా!' అన్నాను. గోపి ఏవో పుస్తకాలు చూస్తూ కాసేపు గడపాడు.

'గోపి!...నువ్వు స్కూలుఫైనలు ప్యాసయ్యాక ఏం చదువుతావ్?'

'పెద్ద పెద్ద చదువులు చదువుకుని గొప్పవాణ్ణవాలనుందండి. కాని ఓ కాలులేదు. అందుకే అమ్మ, కుంటివెధవకు చదువెందుకు? గొడ్లను కాస్తాడు. పంపండి. అంటోంది.'

మనసు చివుక్కుమంది. అతని ముఖంలో వెలుగు నన్ను ఆలోచనలో పడేసింది.

'మీ అమ్మ ఏమన్నా సరే. నువ్వు చదివితీరాల్సిందే. ఇంతకూ నీకు ఏదెక్కువ ఇష్టం? హిస్టరీ-జాగ్రఫీ- సైన్సు- లెక్కలు.'

అది గోపికి క్లిష్టమైన సమస్యని నాకు తెలుసు. ఎందుకంటే, ప్రతి సబ్జక్టులోనూ మొదటిమార్కు అతనిదే! గోపి నాకేసి అమాయకంగా నవ్వాడు.

'గోపి!...అంత త్వరగా ఏ నిర్ణయానికి రాలేవు ...లెక్కలా?' కాదని తలూపాడు.

'పోనీ ఇంగ్లీషు?' అతను నవ్వాడు.

'సైన్సు?'

'అవునండి...అందులో ప్రతిపాఠం చిత్రంగా వుంటుంది. మనకు తెలియనివి చాలావుంటాయి.' అన్నాడు.

అర్థమైపోయింది. విజ్ఞానశాస్త్రంలో అతని భవిష్యత్తు యిమిడివుంది. సరైనమార్గంలో అతన్ని నడిపిస్తే గొప్ప శాస్త్రవేత్తవుతాడు.

'గోపి!...నాకు తెలిసిపోయింది. రేపట్నుంచి సాయంత్రం నా దగ్గరకురా! నీకు సైన్సుపాఠాలు చెబుతాను. జాగ్రత్తగా అర్థంచేసుకో. మంచి రోజులు వస్తాయి.' అన్నాను వుత్సాహంగా. అతను 'ఏమాతాడో, ఏమోనని' భయపడుతున్న నా హృదయం ఒక్కసారిగా గంతులువేసింది.

'అలాగేనండి...' అని రెట్టించిన ఆనందంతో తల వూపాడు

రెండు నిమిషాలు గడిచాయి.

'మేష్టారూ! ఏవైనా కొత్త పుస్తకాలు కొనుక్కోవాలాండి?'

'ఓ పెద్ద నోటుపుస్తకం కొనుక్కో. రెండు-మూడు నెలలు పోయాక తతిమా పుస్తకాలు కొనొచ్చు.'

ఏదో ఆలోచిస్తూ గదిలో రెండు మూడుసార్లు తిరిగాడు. తన జీవితానికిక వెలుగులేదని భావించిన అతని మనసులో ఒక్క మెరపు మెరసింది. అచేతన వస్తువులో జీవం మెదలింది.

'ముందు ఏ పాఠం చెబుతారు మేష్టారు? విద్యుచ్ఛక్తి గురించి చెబుతారా? వద్దు...గ్రామఫోను—ఛీ! ఛీ! ఇప్పుడు ఎవరూ కొనటం లేదు. రేడియో గురించి చెప్పండి.'

'అదంతా నాకు తెలుసు.'

'మేష్టారూ! మీరు ఏం రాస్తున్నారు?

'ఏదో కథలే! ఏం? ఎందుకు?'

'మీకు కథలు రాయటం వచ్చునాండి? నాకు తెలియదు మేష్టారూ! నా గురించి ఓ కథ రాయరూ? ఏదైనా పత్రికకు పంపండి. చదివి అందరికీ చూపిస్తాను.'

'గోపీ! నీ గురించి కథ తప్పకుండా రాయగలను. కాని...కాని...దాని ముగింపు? ...ఏమని రాయమంటావ్? ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యావని రాయనా?'

'ఓస్!....ఇంతేనా! నేను చనిపోయినట్టు రాయండి...అదే బాగుంటుంది. త్వరగా రాసేయండి.'

అతనికి సమాధానం చెప్పేలోగా ఎవరో విద్యార్థివచ్చి నమస్కరించి వినయంగా చేతులు కట్టుకుని, ఎదురుగా నిలబడ్డాడు.

'ఏమోయ్ రవణా!....ఇలా రాత్రప్పుడు వచ్చావ్?'

'మరేం లేదండి...మరి...మరి...' అంటూ నసిగాడు.

'ఫరవాలేదు—ధైర్యంగా చెప్పేయ్!' అని బుజం తట్టాను.

'మరేం లేదండి...పదో తారీఖులోగా జీతం కట్టాలి కదండి...ఇవేళ ఆరో తారీఖు. మూడు నెల ల్నుండి జీతం కట్టడంలేదు. హెడ్మాష్టారు బడికి రావద్దని కచ్చితంగా చెప్పేశారు. మా అమ్మ, నాన్న బీదవారు. నాన్నకు వస్తుందనుకున్న డబ్బు రాలేదు. మీరు దయతలిచి ఓ పదిరూపాయలిస్తే వచ్చే నెల తీరుస్తాను.

అతని ముఖం చూస్తే జాలివేసింది. చింపిరితల. కుటు తొడుక్కున్న చొక్కా. చిరుగుపంట్లాం. ఇలాంటి విద్యార్థులు మనదేశంలో వేలకొలదీవున్నారు. పాపం వీళ్లందరూ ఎలా చదువుకుంటారు? విశాల మన స్తత్వం ఎలా అలవడుతుంది?...సాయంచేయాలనే వుంది. కాని వచ్చిన చిక్కేమిటంటే, నా దగ్గర రెండు రూపాయలున్నాయి.

'రవణా!...నువ్వు చెబితే నమ్మవు! నా దగ్గర రెండే రూపాయ లున్నాయి. ఎవర్నయినా అడిగి చూస్తాను. నీ అదృష్టం మరి. రేవు కనపడు.'

రవణ ఏదో అడగబోయి నమస్కరించి వెళ్ళిపో యాడు. మనసు విరిగింది. గోపికేసి చూశాను. అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"గోపి! టైం తొమ్మిదికావస్తోంది ఇంటికి వెళ్లు. అమ్మ, నాన్న నీకోసం వెతుకుతుంటారు" గోపి వెళ్ళిపోయాడు.

ఆరాత్రి తలుపులు వేసి పడుకున్నా. గోపి అన్న మాటలు అక్షరాలా నిజం. పదిపది హేను నక్కలు కిటి కీలగుండా నాకేసిచూసి నవ్వాయి. ఒంటరిగా వున్నం దున, నిజంగా భయంవేసింది కూడా. ఆ మర్నాడు సాయంత్రం రవణ నవ్వుతూ వచ్చాడు.

"మీరు చాలా మంచివారండి మేష్టారూ!... మానాన్నతో కూడా చెప్పాను. మీ పదిరూపాయలు వచ్చే నెల తిరిగిచ్చేస్తానన్నాడు" అన్నాడు. నాకేం బోధపడలేదు. అతనికి నేను డబ్బివ్వలేదని నాకు బాగా తెలుసు.

'ఏమిటోయ్! వేళాకోళా లాడుతున్నావ్? నేను నీకు డబ్బివ్వట మేమిటి?...లేదని నిన్ననే చెప్పానుగా!' అన్నాను.

'అదేమిటండి!......మీ రిచ్చారని గోపి ఈ వుదయం ఇచ్చాడు.'

నా కర్థమైంది. మాట్లాడకుండా క్లాసుకు వెళ్లాను. ఆ రాత్రి గోపిని ఈ విషయమై అడిగాను.

'నేను చేసింది తప్పేనండి మేష్టారూ!...కాని అతన్ని చూస్తే నాకు ఏడుపొచ్చింది పాపం! మంచి బట్టలు లేవు. తలకు నూనె రాసుకోడు. నాలుగు మైళ్ళు నడచివస్తాడు రోజూ. మా నాన్న దగ్గర బోలెడు డబ్బుంది. కొంత తీసిస్తే తరిగిపోదండి. ఇప్పుడు నాకెంతో ఆనందంగా వుందండి...'

'ఈ సంగతి మీ అమ్మకు, నాన్నకు తెలుసా?'

'తెలియదండి' అన్నాడు బెదరుగా చూస్తూ.

'నువ్వు చేసినపని మంచిదో, చెడ్డదో తరువాత నిర్ణయిద్దాం. నువ్వు చేసినపని దొంగతనంతో సమానం. ఇక ముందెప్పుడూ చేయకు.' అని అప్పు తీసుకుని ఆ డబ్బు తిరిగిచ్చేశాను.

ఆనాటినుండి గోపి ఒక్కరోజు విడవకుండా వచ్చేవాడు. చెప్పిన ప్రతిపాఠం శ్రద్ధగా చదివేవాడు. బాటరీల సహాయంతో చిన్న బల్బు వెలిగించి చూపిం చాడు. ఇంట్లో తన గదిలో విద్యుద్దీపం వెలిగించాడు. గోపికి మార్కులు ఎక్కువ వస్తే తతిమా విద్యార్థులు నామీద అనుమానంతో అతని పేపరంతా జాగ్రత్తగా చూసేవారు. ప్రశ్నపత్రాలు ముందే అందజేస్తున్నా నని అపనిందలు వేశారు. సూటిపోటిగా క్లాసులో ఏవేవో అనేవారు. కాని మనసు దృఢపర్చుకుని గోపి శ్రేయస్సుకోసం పాటుపడ్డాను. అలా అయిదు నెలలు గడిచాయి.

ఓనాడు రాత్రి వెంటనే రమ్మని డాక్టరుగారు కబురంపారు. అయన్ని అప్పుడప్పుడు కలుసుకోటం, గోపి గొప్పతనం గురించి ప్రస్తావించటం జరిగింది. ఆయన విని విననట్టు నవ్వి వూరుకునేవాడు. నిజానికి, ఆ పొద్దున్నే ఆయన్ను కలుసుకున్నాను. ఇంతలో ఏంకొంప మునిగిందోనని పరుగుత్తుకు వెళ్ళాను.

'రావయ్యా గురూత్తమా!...కబురంపి గంటన్న రైంది. ఇప్పటికైనా వచ్చావు. బాగుంది. ఇప్పుడు నీ తల, నాతల ఎగిరిపోయే ప్రమాదపరిస్థితి వచ్చింది.' అంటూ వుపోద్ఘాతం ముగించారు. ఓనిమిషం నిశ్శబ్దంగా వున్నాం.

'ఇవేళ మధ్యాహ్నం గోపితల్లి నాతో మంత్రా లోచనలు జరిపింది. దేనికో తెలుసా?...గోపి బతికి వుండటం తనకు ఇష్టంలేదట. అదీకాక నువ్వు చెప్పే పైత్యాల ఫలితంగా అతని తెలివి హద్దులు మీరి, నాన్న

గారి అనురాగాన్ని సంపాదించుకుంటున్నాడట— అందుచేత ఏదైనా ఇంజక్షనుకాని, మందుకాని ఇచ్చి చంపేయమంటోంది.'

నానోట మాట రాలేదు. భయపడుతూ వచ్చిన నిజం దగ్గరకు వచ్చినట్టయింది. నేను వేసుకున్న పథకాలన్నీ ఒక్కసారిగా నన్ను వెక్కిరించాయి.

'మీరేమన్నారు?...' అనడిగాను.

డాక్టరుగారి ముఖం ఎర్రబడింది. బల్లమీద గట్టిగా గుద్దారు.

'ఏమంటానయ్యా?......ఒప్పుకున్నాననుకుంటున్నావా?...ఏమనిషన్నా ఒప్పుకుంటాడటయ్యా? చీవాట్లువేసి. జడిపించి వచ్చాను. ఇకముందు గోపికేదైనా ప్రమాదం సంభవిస్తే ఆమెను జైలుకు పంపిస్తానన్నాను. కాని నిర్లక్ష్యంగా నవ్వేసి వూరుకుంది. దీన్నిబట్టి ఆలోచిస్తే ఆమె ఎలాగైనా గోపిని చంపేస్తుందేమోనని భయంగా వుంది—ఏంచేద్దామంటావ్?... చూస్తూ, చూస్తూ ఓ కుర్రాడిని వదలుకుంటామా? అందులోనూ బుద్ధిమంతుడు.'

జీవితానుభవం వున్న డాక్టరుగారికి తోచని వుపాయం నాకేం తోస్తుంది?

'గోపిని తీసుకుని మరోవూరు వెళ్ళమంటారా?'

'నువ్వు తెలివితక్కువ వాడివని ముందే తెలుసు కాని, ఇంత మరీ దిగజారిపోతావనుకోలేదు. నువ్వు తీసుకుపోతే తలిదండ్రులు వూరుకుంటారటయ్యా?... పోలీసుకు రిపోర్టుచేసి కొట్లో వుంచుతారు.'

నేను ఆలోచిస్తూ కూర్చున్నా.

'అంతా నేను ముందే నిర్ణయించాను. నీ బుద్ధిబలం పరీక్షిద్దామని అడిగాను. పట్నంలో వికలాంగులకు ఓ ఆశ్రమంవుంది. అందులో చేరుద్దాం ... కాని మూర్తిని ఒప్పించటంలో చిక్కంతా వుంది. అతను శ్రీమంతుడు. కనుక వినిపించుకోడు - ఏమైనా ప్రయత్నించటం మనవిధి. బయలుదేరు.' అన్నారు.

మేం వెళ్ళేసరికి మూర్తిగారు ఇంట్లోనే వున్నారు. సీతాపతిగారు తన చాకచక్యాన్నంతా వినియోగించి ఆయన మనసు మార్చారు. గోపి జీవితంలో ముందుకు రావాలంటే ఆ దొక్కటే మార్గమని ఆయన వాదించారు. మూర్తి ఒప్పుకున్నారు.

'ఒకవేళ ఆమె ఒప్పుకోకపోతే?' అనడిగాను తోవలో డాక్టరుగార్ని.

'అలా ఎన్నటికీ జరగదు. ఆమెకూ సంతోషంగానే వుంటుంది.' అన్నారు.

* * * *

అనుకున్నట్టు అంతా స్థిరపడింది.

సంగతి తెలుసుకున్నాక, గోపి వెళ్ళనంటూ ఏడ్చాడు. ఎన్ని బాధలున్నా అతనికావూరు, ప్రకృతి, అక్కడి మనుష్యులు నచ్చారు. వీడ్కోలివ్వటానికి బస్సుస్టాండుకు వెళ్ళాను. మూర్తికూడా వున్నారు. గోపి కిటికీవారగా కూర్చున్నాడు. చెంపలమీదుగా నీరు కారుతోంది.

'మేష్టారూ!...నిజం చెప్పండి! మీరు నన్ను గొప్పవాణ్ణి చేస్తానన్నారు. పుస్తకాలు అవీ కొనమన్నారు. నేను ఏతప్పూ చెయ్యలేదు. శ్రద్ధగా చదువుకుని, మీరు చెప్పినట్టు అన్నీ చేశాను. నన్నెందుకు ఆశ్రమానికి పంపిస్తున్నారు మేష్టారు? నేనంటే మీ కసహ్యం కలుగుతోందా?'

అతికష్టంమీద ఏడుపు దిగమింగుకున్నాను. అతనికేమని సమాధానం చెప్పను? నిజాన్ని ఎలా వివరించను? అతని మాటల్లో చివరివాక్యం నన్ను చురుక్కున పొడిచింది. గోపి నన్నను మానిస్తున్నాడు.

'గోపీ! నువ్వు లేనిపోనివన్నీ వూహించుకుని బాధపడుతున్నావు. ఆశ్రమంలో నాకంటె ఇక్కడి వాళ్ళందరికంటె మంచి వాళ్ళుంటారు. వారందరూ నీకు మార్గదర్శకులౌతారు.' అన్నాను ఎటో చూస్తూ.

'అబద్ధం మేస్టారూ!...మీలా నన్ను అర్థం చేసుకునేవా రెవరూలేరు. ఉండబోరు. నేను కుంటివాణ్ణి కనక నన్ను తరిమేస్తున్నారు. మేష్టారూ! నా కుంటికాలు బాగుపడేందుకు మార్గాలు లేవాండి?'

గోపి ఈనాటివరకూ ఇలాంటి పశ్న వేయలేదు.

'తప్పకుండా బాగుపడుతుంది. ఆపరేషన్ చేసి కొత్తకాలు పెడుతారు. దానితో నువ్వుకూడా మామూలాగే తిరగగలవు. మాకు మల్లే జీవించగలవు. అయితే కొంతకాలం ఆగాలి-అనుకున్నట్టు ప్రతిదీ జరగదు. ఇదంతా ఆలోచించే మీనాన్నగారు నిన్ను పట్నానికి పంపిస్తున్నారు. అక్కడి మనుష్యులు నీలాంటి వారిమనస్తత్వాలను బాగా అర్థం చేసుకున్నవారు. ఏం చేయవలసింది వారికి బాగా తెలుసు.'

బస్సు బయలుదేరటానికి ఇంక ఐదునిమిషాలుంది. డాక్టరుగారు వస్తారనుకున్నా. ఆయనరాలేదు. రోడ్డంట

పోతున్న కుంటి కుక్క మీద అల్లరిపిల్లలు రాళ్ళురువ్వుతున్నారు. గోపి అదే దృశ్యాన్ని తదేక దృష్టితో చూస్తున్నాడు.

'మేష్టారూ!...ఆ కుక్క పాట్లు చూశారా?... నా గతి అంతే!' అన్నారు.

అతని కిష్టమైన పుస్తకాలు కొన్ని కొనుక్కొచ్చాను. అవన్నీ అందించాను. మా ఇద్దరిమధ్య ఇంతసేపట్నుంచి సంభాషణ జరుగుతున్నా మూర్తిగారు మౌనంగా వుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన ముఖంపాలిపోయి కళావిహీనంగా వుంది. బస్సు బయలుదేరటానికి సిద్ధమైంది.

'గోపి! జాగ్రత్తగా, బుద్ధిగా చదువుకో. అప్పుడప్పుడు నేను నిన్ను వచ్చి చూస్తూంటాను' అన్నాను. బస్సు కదలించి. గోపి చేయి వూపాడు. ధూళిరేపుతూ కదలిపోతున్న బస్సుకేసి చూస్తూ నిలబడ్డాను.

*   *   *

గోపి వెళ్ళిపోయినప్పట్నుంచి నాలో కూడా చిత్రమైన మార్పులు వచ్చాయి. మానవత్వంమీద మమకారం, విశ్వాసం నశించాయి. భవిష్యత్తును గురించి మనం ఆలోచించి, పథకాలు వేసుకోడం తెలివితక్కువనిపించింది. మనం శ్రమపడి, జీవితవిధానాన్ని నిర్ణయించటం, అనుకోకుండా వచ్చిపడే అవాంతరాలు అన్నింటినీ తారుమారు చేయటం-అంతకంటె 'జరిగేదేదో' జరుగుతుందని కళ్ళు మూసుకొని జీవించటం మేలనిపించింది. గోపి విషయంలో, నేననుకున్నట్లు అన్నీ జరిగినా, ఒక సంవత్సరంలో అతన్ని పైకి తీసుకురాలేను. ఏళ్ళకొలది పరిశ్రమ దానికవసరం. ఏడాది గడిచాక ఆ వూరు విడిచి వెళ్లటం తప్పదు. అతనికోసం నా జీవిత లక్ష్యాలను ఎలాగూ త్యాగం చేయలేను. అలాంటప్పుడు అతన్ని గురించి బాధపడటం కూడా పొరపాటేమో ననిపించింది. ఏదెలావున్నా, ఇవన్నీ ఆత్మతృప్తికోసం ఏర్పడిన కారణాలు.

మూడు నెలలు గడిచాయి. జీవితం బరువుగా నడుస్తోంది. అప్పుడప్పుడు మూర్తిగార్ని, డాక్టరుగార్ని కలుసుకొని గోపిగురించి తెలుసుకుంటూనే వున్నాను. అతను చక్కగా చదువుకుంటున్నట్లు వుత్తరాలు వస్తున్నాయన్నారు.

ఓనాడు సాయంత్రం నాకేదో వుత్తరం వచ్చింది. దస్తూరీ చూడగానే అదెవరు రాసింది తెలిసిపోయింది. చించి చదువుకున్నా—"మేష్టారికి గోపి నమస్కారాలు—ఈ వుత్తరం రాసి మీ కాలాన్ని వృథా చేస్తున్నందుకు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నా. ఇక్కడంతా బాగానేవుంది.

ఉదయం నాలుగ్గంటలకు లేవాలి. తతిమా పిల్లలతోబాటు స్నానాలు చేయాలి. తరువాత ఏవో అర్థంకాని ప్రార్థనలు—ఏడింటికి పాఠాలు—ఆ చెప్పే మేష్టారుకి అందరిమీదా కోపం—మాలో కుంటివాళ్ళు సొట్టవాళ్ళు చాలామందున్నారు. కనీసం పదిమందికైనా దెబ్బలు తగులుతాయి. వచ్చిన మొదటిరోజునే నాకు దెబ్బలు తగిలాయి. ఆ పాఠాలు ఎవరికీ అర్థంకావు. ఏవేవో బోర్డుమీద రాస్తారు. మేం రాసుకోవాలి.

మధ్యాన్నం రొట్టెముక్క, అన్నం, కొంచెం పాలు ఇస్తారు. అన్నీ వాసనకొడతాయి మేష్టారూ! మొదటి మూడురోజులు తినలేకపోయాను. తరువాత ఆకలికొలదీ తినక తప్పదు. మాఇంట్లో తినే పప్పన్నం జ్ఞాపకానికొస్తోంది. సాయంత్రం ఏవేవో ఆటలు—తొమ్మిదయేసరికి పడుకోవాలి. ఇదీ మా కార్యక్రమం.

ఇలా రోజూ జరిగిపోతోంది. ఏమాత్రం వుత్సాహం లేదు. క్రొత్తవిషయాలు ఏవన్నా చెప్పమనడిగితే 'కుంటి వెధవలకు ఇంతకంటె ఎక్కువెందుకు? ఎలాగూ మీరంతా ముష్టెత్తుకునే వారేగా!' అంటారు. మీరిచ్చిన పుస్తకాలు చదువుతున్నాను. ఏమీ బోధపడటం లేదు, అడుగటానికి మీరు దగ్గరుంటే బాగుండు ననిపిస్తోంది.

మరో విచిత్రం మేష్టారూ! మాలో అందరికీ కాళ్ళూ, చేతులూ లేకపోయినా ఒకరిమీదొకరికి కోపాలు, అసూయలు, పగలు వున్నాయి. అవన్నీ ఇంకా ఎందుకో! నేను ఏదన్నా చెబితే అందరూ కలిసి వేళాకోళం పట్టిస్తున్నారు..."

ఇంక చదవలేక వుత్తరం మడిచేశాను. డాక్టరుగారికి ఉత్తరం చూపించాను.

'కొత్తకదటయ్యా! అలాగే వుంటుంది. అలవాటుపడితే అతనే సర్దుకుపోతాడు.' అన్నారు. ధైర్యంగా వుండమని, జాగ్రత్తగా చదువుకోమని అతనికి జవాబు రాశాను.

కాని గోపి వుత్తరాలు రాస్తూనే వున్నాడు. తిరిగి తనకు రామాపురం రావాలనుందని, నాదగ్గర

చదువుకోవాలని రాసేవాడు. అతన్ని తిరిగి తీసుకు రావటం కుదరదు. అలా రెండు నెలలు గడిచాక గోపి నన్ను వెంటనే రమ్మని వుత్తరం రాశాడు. అతని అభిప్రాయాలు చదువుకుంటే, చిన్న గుండెలో క్రమ క్రమంగా చీకటి నిండుతోందని అర్థమైంది. ఒకవేళ అతను మనసు విరిగి ఆత్మహత్య చేసుకుంటే...... ఆదివారం బయలుదేరి వస్తున్నట్టు వుత్తరం రాశాను. ఆదివారం వుదయం బయలుదేరబోతుంటే వెంటనే బయలుదేరి రమ్మని అన్నయ్య దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. ఏదో మంచి వుద్యోగం స్థిరపరచినట్టు మాటా ముల్లె సర్దుకుని తక్షణం రమ్మని దాని సారాంశం.

తిన్నగా డాక్టరుగారి దగ్గరకు వెళ్లి సలహా అడిగాను.

'ఇదేం పెద్ద సమస్య కాదయ్యా!...నీ భవిష్యత్తు పాడుచేసుకోకు. గోపినిగురించి మేం జాగ్రత్తపడతాం. నువ్వు వుండి చేసే దేమీ లేదు. ఎలాగూ ఎడాదయ్యాక వెళ్లటం తప్పదు. కనుక హెడ్మాస్టారితో చెప్పి ఈ మధ్యాన్నం బండికే వెళ్లిపో. ఉత్తరాలు రాస్తూండు. ఈ ప్రాంతాలకు వస్తే మిమ్మల్ని చూసిపో!'

ఆయనకు సాష్టాంగ నమస్కారం చేయాలని పించింది. గోపి చివరిసారిగా రాసిన వుత్తరంలో కూడా 'నాగురించి రాస్తున్న కథ ఎంతవరకూ వచ్చింది?' అనడిగాడు. అతని వుత్తరాలన్నీ జాగ్రత్తగా పెట్టెలో వుంచాను.

మధ్యాన్నం రామాపురం విడిచి పెట్టాను.

*          *          *

కథ చదువుకోటం పూర్తయింది. ఈ పదిహేను సంవత్సరాలుగా దీన్ని ముగించ లేకపోయాను. డాక్టరుగార్ని కలుసుకుంటేనే కాని, గోపి ఏమైంది తెలియదు. కాగితాలు జేబులో వుంచుకుని సీతాపతి గారిల్లు చేరుకున్నాను. ఆయన నిద్రపోటానికి చివరి మెట్టుమీదున్నారు. నన్ను చూడగానే ఆప్యాయంగా ఆదరించి కూర్చోబెట్టారు. ఈపదిహేను సంవత్సరాలలో ఆయన ఎక్కువగా మారలేదు. జట్టు మరి కొంచెం నెరిసిందేమో? కళ్ళుమాత్రం చిలిపిగా నవ్వుతున్నాయి.

'మాట నిలబెట్టుకున్నావయ్యా!...ఈ ప్రాంతాలకు వస్తే రమ్మన్నాను. వచ్చావ్!' ప్లాస్కులో వున్న కాఫీ కప్పులో పోశారు. ఈ దీర్ఘకాలంలో జరిగిన విశేషాలు మాటాడుకున్నాం.

'డాక్టరుగారూ!...గోపి, గురించి...' అని ఆగాను.

'అతను ఏమవుతాడని వూహించావ్?'

'ఈపాటికి యూనివర్సిటీ చదువు పూర్తై ఎక్కడో రిసెర్చి చేస్తూంటాడని అనుకుంటా.'

డాక్టరుగారు ఇదివరకుమల్లే విరగబడి నవ్వలేదు. విషాదంగా నవ్వారు. నాకు భయంవేసింది.

'కాదయ్యా!...విషాదవార్తను మళ్ళ జ్ఞప్తికి తెచ్చావ్...నువ్వు వస్తానని అతనికి వుత్తరం రాశావు. కాని వెళ్ళలేదు. ఆరోజంతా నీకోసం ఎదురుచూశాడట—తతిమా విద్యార్థులతో నువ్వు వస్తున్నట్టు చెప్పుకుని మురిసిపోయాడుట—ఆ సాయంత్రం చనిపోయాడు.'

దిగ్భ్రమతో చూస్తూ కూర్చున్నా.

'అంటే?...ఎలా చనిపోయాడు?'

'అతనికి విద్యుద్దీపాలంటే పిచ్చికదా!...నువ్వు కూడా ఏవేవో నూరిపోశావు. ఏదో ప్రయోగం చేద్దామని పొరపాటున తీగలు ముట్టుకున్నాడు. చనిపోయాడు.'

'ఈ వార్త నిజమేనా?" లేక వేళాకోళ మాడుతున్నారా?'

డాక్టరుగారు కోపంతో కళ్ళెర్రచేసి బల్లమీద గట్టిగా గుద్దారు.

'డాక్టరు సీతాపతి ఎప్పుడైనా అబద్ధమాడాడా?' అని అరిచారు. ఆయనదగ్గిర సెలవు తీసుకుని బయటికొచ్చాను.

*          *          *

ముగింపు దొరికింది. కాని నేను ఆశించిన విధంగా కాదు. గోపి తను చనిపోయినట్టు కథను ముగించమని అప్పుడప్పుడు సూచించినా, అతను చనిపోతాడని నేనెన్నడూ అనుకోలేదు. గొప్ప వ్యక్తి అవుతాడని కలలు కన్నాను.

ఉన్నట్టుండి మరో సందేహం కూడా కలిగింది. నేను వస్తానన్న రోజునే గోపి చనిపోవటంలో అంతరార్థం ఏమిటి? అతను నిజంగా ప్రమాదవశాత్తూ మరణించాడా లేదా? ఒకవేళ మనసు విరిగి ఆత్మహత్య చేసుకున్నాడేమో!...అవును. అలా ఎందు కాకూడదు? కాని ఎందుకో గోపి అలాంటిపని చేయడని అంతరాత్మ ఓమూల ఘోషిస్తోంది. ఏమైనా గోపి చనిపోయాడన్న వార్త మాత్రం నిజం.

మర్నాడు బండిలో తిరుగుముఖం పడుతూ మరపురాని నాగోపిని, అతనితో నాకున్న స్వల్ప పరిచయాన్ని తల్చుకుని రెండు కన్నీటిబొట్లు రాల్చాను. అంతకంటె నేను చేయగలిగిన దేమీలేదు - కథంటూ వ్రాసి ముగింపు కనుక్కున్నా.

కాని చదివేందుకు గోపి ఏడి? ఏమైనా అతనికి నే నిచ్చినమాట నిలబెట్టుకున్నా.